సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన అపర్ణ సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



క్లినికల్ ల్యాబ్‌కు రూ.లక్ష విరాళం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): బాదం బాల కృష్ణ క్లినికల్ ల్యాబ్ నిర్మాణానికి సిద్ధివినాయక ట్రాన్స్‌పోర్ట్ అధినేత ఎస్‌కే అహ్మద్ (కాకినాడ) సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 6,895 క్యూసె క్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు 2,030, సెంట్రల్ 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

మార్చి 12న జాతీయ శతాధిక కవి సమ్మేళనం



కవి సమ్మేళనం బ్రోచర్లను విడుదల చేస్తున్న డాక్టర్ ప్రతాప్, కవులు

అమలాపురం టౌన్: స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో మార్చి 12న ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు శ్రీశ్రీ కళావే దిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి తెలిపారు. కవి సమ్మేళనం నిర్వహణపై స్కూలు లో సోమవారం వేదిక జిల్లా ప్రతినిధులు సమావే శమై చర్చించారు. వేదిక కన్వీనర్, కవి బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమా వేశంలో వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొని కవి సమ్మేళనం బ్రోచర్లను విడుదల చేశారు. వేదిక జిల్లా గౌరవా ధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 50 వేల విరాళం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం లో నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ఆర్క్యులాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేసే గంటి కామేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు. చెక్కును ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు)కు అందజేశారు.

శనైశ్చర క్షేత్రంలో భక్తులకు సౌకర్యాలు

అధికారులతో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి సమీక్ష



కొత్తపేటలో అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: 'మహాశివరాత్రి – శనిత్రయోదశి' పర్వ దినం సందర్భంగా ఈ నెల 18న మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి క్షేత్రానికి తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. 20 సంవత్సరాల తరు వాత 'మహాశివరాత్రి – శనిత్రయోదశి' కలిసి వచ్చినందున శనిదోష నివారణకు క్షేత్రానికి లక్షకు పైబడి భక్తులు వస్తారని అంచనాతో సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ ఎం.ముక్కంటి అధ్యక్షతన జరిగిన సమా వేశంలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ మొబైల్ టాయ్ లెట్స్, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయా లని, రెండు అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అదనంగా నాలుగు జనరేటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఏటిగట్టు రోడ్డు ఆధునీకరణకు, 2 లక్షల వాటర్ ప్యాకెట్ల సరఫ రాకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీసీ విజ యరాజు మాట్లాడుతూ పూజలు, తైలాభిషేకానికి రూ.300 టికెట్ పెట్టామన్నారు. డీఎస్పీ కేవీ రమణ, ఎంపీపీ ఎం.గంగాధరరావు, దేవదాయ శాఖ ఆర్‌జేసీ ఎం.సురేష్‌బాబు, ఆలయ ఏసీ అం డ్ ఈఓ సింగం రాధ, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, మందపల్లి వీడీసీ కన్వీనర్ చెంచయ్య పాల్గొన్నారు.

పెరిగిన ఉద్యానం

- ఉద్యాన పంటల వైపు రైతుల దృష్టి
- వరికి దీటుగా ఏటా విస్తరిస్తున్నసాగు
- జిల్లాలో 1.52 లక్షల ఎకరాల్లో..



కొత్తపేట మండలం గంటి వద్ద ఒకే చోట కొబ్బరి, అరటి, కోకో, బెండ, వంగ ఉద్యాన పంటల సాగు

సాక్షి అమలాపురం: జిల్లా ఉద్యాన వంటల ఖిల్లాగా మారుతోంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ కొబ్బరి, అరటి, కూరగాయ పంటల సాగు జరుగుతుండగా పదేళ్ల నుంచి సాగు విస్తీర్ణం గణనీ యంగా పెరిగింది. రాష్ట్రంలోనే డాక్టర్ బీఆర్ అం బేడ్కర్ కోనసీమ జిల్లా ఉద్యాన హబ్‌గా మారింది.

తగ్గిన వరి వాస్తవ సాగు

జిల్లాలో సుమారు 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని అధికార లెక్కలు కాగా, ఆక్వా, రియ ల్ ఎస్టేట్, ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గు చూప డంతో వాస్తవ సాగు 1.70 లక్షల ఎకరాలుగా ఉంది. గడిచిన ఐదేళ్లలో మధ్య డెల్టాలో కొత్తపేట, పి.గన్నవ రం, అంబాజీపేట, తూర్పు డెల్టాలో ఆలమూరు, మం డపేట, కపిలేశ్వరపురం మండలాల్లో ఉద్యాన పంటల సాగు అధికంగా ఉంది. జిల్లాలో 1,52,999 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతోంది. దీనిలో అత్యధి కంగా 1,10,732 ఎకరాల్లో కొబ్బరి అగ్రస్థానంలో ఉం ది. వీటితోపాటు 20 వేలకు పైగా ఎకరాల్లో అరటి, తరువాత కోకో, కూరగాయలు, ఆయిల్ పామ్, పువ్వులు, బొప్పాయి, కంద, పసుపు, మామిడి వంటి పంటలు సాగు అవుతున్నాయి.

గోదావరి లంకల్లో పూర్తి స్థాయి సాగు

గత ఏడాది గోదావరికి రికార్డు స్థాయిలో వరదలు వచ్చాయి. జూలై నుంచి సెప్టెంబర్ వరకూ ప్రతీ నెల క్రమం తప్పకుండా వచ్చిన వరద వల్ల డిసెం బరు నెల వరకు సాగు చేపట్టలేని పరిస్థితి. జనవ రిలో 4,880 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పం టల సాగు ఆరంభమైంది. ఈ ఏడాది పి.గన్నవరం మండలం బెల్లంపూడి వద్ద జిల్లాలోనే తొలిసారిగా పొద్దుతిరుగుడు సాగు చేపట్టడం విశేషం.

కొబ్బరిలో పెరిగిన అంతర పంటలు

కొబ్బరిసాగు సంక్షోభంలో ఉన్నా వీటిలో అంతర పంటల సాగు చేస్తున్న రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. కొబ్బరిలో కోకో, అరటి, పసుపు, కంద, కర్రపెండలం, పువ్వులు, అర్నమెంట్, కూర



ఆత్రేయపురం మండలం పేరవరం వద్ద కొబ్బరిలో అరటి సాగు



రావులపాలెం మండలం వెదిరేశ్వరం వద్ద కొబ్బరిలో అర్నమెంట్ పువ్వుల సాగు

గాయలు వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఇటీ వల రైతులు ఒకే క్షేత్రంలో కోకోతోపాటు వక్క (పోక), కొబ్బరిలో అరటి, కోకో, పోక, మిరియం వంటి పంటలను ఏకకాలంలో సమీకృత సాగు చేయడం ద్వారా ఎకరాకు ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం సాధిస్తున్నారు.

ప్రభుత్వం చేయూత

రైతుకు అధిక ఆదాయం వస్తున్న ఉద్యాన పంటల సా గును రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. పగటి పూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందిం చడంతోపాటు ఆర్‌కేవీవై, ఎపిలిప్, ఎస్ఎఫ్ఎస్ఎం, ఎంఐడీహెచ్ వంటి పథకాల్లో రూ.53.18 లక్షల రాయి తీలతో పంటలు నిల్వ చేసుకునేందుకు ప్యాక్ హౌస్ లు, కోల్డ్ స్టోరేజ్‌లు, యంత్ర పరికరాలు, తోటల నిర్వ హణ, తోటల విస్తీర్ణానికి రాయితీలు ఇవ్వడం కూడా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమైంది.

జిల్లాలో సాగు విస్తీర్ణం ఇలా (హెక్టార్లలో)..

ఉద్యాన పంట	సాగు విస్తీర్ణం
కొబ్బరి	44,830.8
అరటి	8,498.5
కోకో	925.66
కూరగాయలు	4449
స్వీట్ ఆరెంజ్	498
ఆయిల్ పామ్	417.17
మామిడి	240
బొప్పాయి	314.5
పువ్వులు	800
ఇతర పంటలు	916
మొత్తం	61,943

స్వల్పకాల కూరగాయ పంటలు



వరదల వల్ల ఈ ఏడాది లంకల్లో కూరగాయల సాగు ఆలస్యంగా ఆరంభించాం. ఇప్పుడు స్వల్పకా లంలో దిగుబడి వచ్చే కూరగాయల సాగు చేస్తున్నాం. పి.గన్నవరం మం డలం ఉడిమూడి లంకలో ఐదు ఎకరాల్లో కొత్తమీర సాగు చేస్తున్నాం. తరువాత ఏదో ఒక రకం కూరగాయ పంట సాగు చేయనున్నాం.

– కర్రి నర్సింహమూర్తి, ర్యాలి, ఆత్రేయపురం మండలం

మల్టీ క్రాపింగ్ అన్ని విధాలుగా మంచిది



కొబ్బరిలో కోకోతోపాటు, పోక, హెలికోనియా, బర్డ్స్ ఆఫ్ ప్యార డైజ్ వంటి పువ్వుల రకాలు సాగు చేస్తున్నాం. వీటితోపాటు మామిడి, పనస, వాటర్ గులాబ్‌జామ్, సీతాఫలం తక్కువ మొత్తంలో సాగు చేస్తున్నాం. దీని వల్ల కొబ్బరి ఆదాయం తగ్గినా మిగిలిన వాటి మీద మంచి ఆదాయం వస్తోంది.

– యిళ్ల దొరబాబు, రైతు, అయినవిల్లి

కరాటే, కుంగ్‌ఫూలో బంగారు పతకాలు



బంగారు, వెండి పతకాలు సాధించిన లూటుకుర్రు విద్యార్థులు

మామిడికుదురు: కరాటే కుంగ్ ఫూ నేషనల్ చాంపి యన్ షిప్ పోటీల్లో లూటుకుర్రుకు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు, ఒక విద్యార్థి వెండి పతకం సాధించినట్లు శిక్షకుడు మట్టా శ్రీనివాస్ సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన మూడవ నేషనల్ కరాటే కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో మొల్లేటి భాస్కర శివబాలాజీ (5వ తర గతి), కటా విభాగంలోను, ఇంజేటి సూర్యచర ణ్‌తేజ (7వ తరగతి) స్పారింగ్ విభాగంలోను, పెదపూడి ప్రభుతేజ (6వ తరగతి) కటా విభాగం లోను బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. కంబలా దివ్యశ్రీ (6వ తరగతి) కటా విభాగంలో వెండి పతకం సాధించింది. వీరికి శిక్షణ ఇచ్చిన శ్రీని వాసుకు సినీనటుడు సుమన్ ప్రత్యేక బహుమతి అందించారు. బంగారు పతకాలతో పాటు వెండి పతకం సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

9న జాబ్‌మేళా

అమలాపురం రూరల్: ప్రైవేటు కంపెనీల్లో పనిచే యడానికి అమలాపురంలోని ఉపాధి కార్యా లయం వద్ద ఈ నెల 9 ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి సోమవారం ఓ ప్రక టనలో తెలిపారు.

జీతం రూ. 20 వేల నుంచి రూ.25 వేలు ఉం టుందని, అమలాపురం పరిసర ప్రాంతాల్లో పని చేయవలసి ఉంటుందని తెలిపారు. బీటెక్, డిప్లమా, ఈసీఈ, మెకానికల్‌లో విభాగాల్లో ఉత్తీ ర్ణత సాధించిన యువతీ, యువకులు సర్టిఫికెట్స్, బయోడేటాలతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9642255545 నంబర్‌లో సంప్రదిం చాలన్నారు.

ఉద్యోగులు సెల్‌ఫోన్‌తో హాజరు వేయాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం
- స్పందనలో 231 అర్జీల స్వీకరణ

అమలాపురం రూరల్: జిల్లా స్థాయి అధికారులు, సి బ్బంది, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు తప్పని సరిగా ముఖ ఆధారిత హాజరు సెల్‌ఫోన్ ద్వారా వేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జిల్లా స్థాయి స్పందన వినతుల స్వీకరణ కార్య క్రమంలో 231 అర్జీలను కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ సీహెచ్ సత్తి బాబు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్ర భుత్వ ఉద్యోగులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యో గుల కోసం ప్రవేశపెట్టిన ముఖ ఆధారిత హాజరును ఉదయం, సాయంత్రం నిర్దేశిత సమయాలలో తప్ప నిసరిగా వేయాలని సూచించారు. ముఖ ఆధారిత హాజరు అమలు తీరుపై ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. అర్జీలకు పరిష్కార మార్గాలు సకాలం లో చూపాలని తెలిపారు. గడువు దాటిన అర్జీలు, ఒక అంశంపై దాఖలు అయిన అర్జీ పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి అర్జీని నిబంధ నల మేరకు స్పందన ఆన్‌లైన్‌లో ఫొటోలతో సహా అప్లోడ్ చేయాలన్నారు. అర్జీలపై క్షేత్రస్థాయి విచారణ సమయంలో ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలన్నారు. ఐ.పోలవరం మండలం మురమ్మిడివరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు దూనబోయిన శేషారావు ట్రై సైకిల్ ఇప్పించాలని కలెక్టర్‌ను అభ్యర్థించగా, ట్రై సైకి ల్‌ను విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా ఉచితంగా అందించారు. కాకినాడలో



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



కెప్టెన్ హరి టీమ్‌కు కప్పును అందిస్తున్న కలెక్టర్ తదితరులు

రెవెన్యూ శాఖ క్రికెట్ పోటీలలో కోనసీమ జిల్లా కెప్టెన్ హరి సారథ్యంలోని టీమ్ విన్నర్‌గా నిలవడంతో సాధించిన కప్పును తన చాంబర్‌లో టీమ్ సభ్యులకు కలెక్టర్ అందించారు. సీపీఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ఎస్ఈలు చంటిబాబు, కృష్ణారెడ్డి, గృహ నిర్మాణ సం స్థ పీడీ ఎం.బాబురావు, డీఎస్ఓ ఎ.పాపారావు, సివిల్ సప్లయిస్ డీఎం కె.తులసి, డీపీఓ వి.కృష్ణకుమారి, డీఆ ర్డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

విజ్‌డమ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఉప్పలగుప్తం మండలం గొల్లవెల్లి విజ్‌డమ్ యూపీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో వేసిన భోగి మంటల వల్ల విద్యార్థులు గాయపడిన నేపథ్యంలో పాఠశాలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కలెక్టర్‌కు విన తిపత్రం ఇచ్చారు. తమ పిల్లలకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు.

పోలీసు స్పందనకు 30 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన కార్యక్రమానికి 30 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా అర్జీదారులు వచ్చి తమ సమస్యలపై ఆయన అర్జీలు అందజేశారు. కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా ఉన్నాయి. ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆయా పోలీసు స్టేషన్ల ఎస్సైలకు ఫోన్ చేసి పరిష్కారానికి ఆదే శాలు ఇచ్చారు. ఎస్పీ కార్యాలయ స్పందన కార్యక్రమ పర్యవేక్షణ ఎస్సై సీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

సాక్షి అమలాపురం/అల్లవరం: 'కరోనా సమయంలో ప్రభుత్వం మమ్మల్ని ఆదుకునేందుకు కనీస మద్దతు ధరతో రొయ్యలు కొనుగోలు చేయించింది. ఇటీవల మేత ధరలు తగ్గించడంతోపాటు మరోసారి ఎంఎస్ పీకి రొయ్యలు కొనుగోలు చేయించింది. కాని ఈ – ఫిష్ సర్వే మత్స్యశాఖ అధికారులు తప్పులు తడకగా చేయడం వల్ల ఆక్వా రైతులు విద్యుత్ రాయితీని కోల్పోయే దుస్థితి నెలకొంది' అని కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి ప్రతినిధులు మొర పెట్టుకు న్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో సోమవారం సాయంత్రం రైతు ప్రతినిధులు సమావేశమ య్యారు. ఉదయం స్పందన వద్ద ఆక్వా రైతులు ఆం దోళనకు దిగగా, సాయంత్రం వారితో కలెక్టర్ శుక్లా సమావేశమయ్యారు. విద్యుత్, మత్స్యశాఖ అధికా రులతో కలిపి ఆయన సమీక్ష జరిపారు. తాము లేవ నెత్తిన పలు సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ సానుకూలత వ్యక్తం చేశారని పరిరక్షణ సమితి ప్రతి నిధి త్సవటపల్లి నాగభూషణం తెలిపారు. సర్వే నం బర్ల తేడాలను పరిశీలించడం, ఆక్వా జోన్‌లో ఉన్న వాటిని నాన్ ఆక్వాజోన్ పరిధిలో పెట్టడం, చెరువు చుట్టూ కొబ్బరి చెట్లు ఉండగా వాటిని ఉద్యానశాఖ ఈ క్రాప్‌లో నమోదు చేయడం వంటి వాటిని పరిష్క రించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. గతంలో 50 హెచ్‌పీ దాటిన 300 సర్వీసు యజమానులు విద్యుత్ శాఖ చెల్లించిన బిల్లులను ప్రస్తుత బిల్లులలో సరిది ద్దాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. రైతు ప్రతినిధులు యాళ్ల వెంకటానందం, దెందుకూరి సత్తిబాబు రాజు, అల్లూరు రమేష్‌రాజుతోపాటు రైతులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి

ఉగాది నాటికి గృహ నిర్మాణాల పూర్తి, ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశిం చారు. జేసీ ధ్యానచంద్రతో కలసి వివిధ మండ లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 41 లంక గ్రామాలు ఉన్నాయని వీటికి సంబంధించిన సర్వే సమన్వయంతో చేపట్టి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. మాగాణి భూములు అయితే ఒక హెక్టారు అసైన్డ్ భూమిని, మెట్ట భూములయితే రెండు హెక్టార్ల భూమికి పట్టాలు జారీ చేయాలన్నారు. ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తం గా ఐదు లక్షల గృహాలు పూర్తి చేయాలన్న లక్ష్యా నికి అనుగుణంగా మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.

దాతల సహకారం ముదావహం



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ భాస్కరరావు



కలెక్టర్ శుక్లాను సత్కరిస్తున్న దాత కుటుంబ సభ్యులు

రిటైర్డ్ డీజీపీ భాస్కరరావు

మామిడికుదురు: విద్యారంగం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ముదావహమని రిటైర్డ్ డీజీపీ ఎంవీ భాస్కరరావు పేర్కొన్నారు. మామి డికుదురులో దాత యెరుబండి సత్యవర్ధనరావు మెమోరియల్ సైన్స్ ల్యాబ్‌ను భాస్కరరావుతో పాటు మరో రిటైర్డ్ డీజీపీ ఎన్.సాంబశివరావు, కలె క్టర్ హిమాన్షు శుక్లా సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పాఠశాల పూర్వ విద్యార్థి సత్యవ ర్ధనరావు స్మారకార్థం రూ.60 లక్షల వ్యయంతో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. సభలో భాస్కరరావు మాట్లా డుతూ సత్యవర్ధనరావు పేరిట నిర్మించిన ఈ సైన్స్ ల్యాబ్ మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తుంద న్నారు. అత్యున్నత శిఖరాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని చదువుకోవా లని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రిటైర్డ్ డీజీపీ సాంబశివరావు సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి అమెరికాలో డాక్టర్‌గా సేవలందించిన తన సోదరుడు సత్యవర్ధనరావు పేరిట సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని యెరుబండి జగదీష్ ప్రభాకర్ పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ (పరిశ్రమలు) కేవీ రావు, డీఈఓ ఎస్‌వీ రవిసాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు సీహెచ్ నిరంజని, ఎంపీడీఓ కె.వెంకటేశ్వర రావు, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, యెరుబం డి విజయ్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఏ పరీక్షల నిర్వహణకు మార్గదర్శకాలు

రాయవరం: ఈ నెల 10వ తేదీ వరకు జరగనున్న ఫార్మేటివ్–3 పరీక్షలకు జిల్లా విద్యాశాఖ మార్గద ర్శకాలను విడుదల చేసింది. 1–8 తరగతులకు క్లాస్ రూమ్ బేస్డ్ (సీబీఏ) విధానంలోను, 9,10 తరగతులకు పాత విధానంలో పరీక్షలు నిర్వహి స్తున్న విషయం విదితమే. ఫార్మేటివ్–1 పరీక్ష లను సీబీఏ–1గా నిర్వహించారు. సీబీఏ విధా నంలో అస్పష్టత తొలగించేందుకు జిల్లా ఉమ్మడి పరీక్షల సంస్థ (డీసీఈబీ) చైర్మన్‌గా వ్యవహరి స్తున్న జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం పాఠశాలలకు మార్గదర్శకాలను విడుదల చేశారు.

- ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ఎస్‌సీఈఆర్‌టీ జారీచేసిన ప్రశ్నపత్రాలతో మాత్రమే ఎఫ్ఏ–3 పరీక్షలు నిర్వహించాలి.
- ఏ రోజు ప్రశ్న పత్రాలను ఆ రోజు ఉదయం 8గంటలకు రిజిస్టర్లలో సంతకం చేసి ఎంఆ ర్సీల నుంచి తీసుకోవాలి.
- ప్రధానోపాధ్యాయులు పేపర్స్ నిమిత్తం పం పిన ఉపాధ్యాయునికి ఆథరైజేషన్ లెటర్ ఇవ్వాల్సి ఉంటుంది.
- ప్రశ్నపత్రం కట్టల సీల్స్ సరి చూసుకుని, ప్రశ్నపత్రం కట్టను జాగ్రత్త పర్చాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదే.
- 1–5 తరగతి వరకు ప్రశ్న పత్రాలను కాంప్లె క్స్‌ల వారీగా ఏ రోజు ప్రశ్న పత్రాలను ఆ రోజు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది.
- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థు లకు ప్రశ్నపత్రంతో పాటుగా ఓఎంఆర్ షీట్ ఇవ్వాలి.
- ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యా ర్థులకు కేవలం ప్రశ్నపత్రాలు మాత్రమే ఇస్తారు. ఓఎంఆర్ షీట్లు ఇవ్వరు.
- సీబీఏ విధానంలో ప్రశ్నపత్రంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో పాటు, రాతపూర్వక ప్రశ్నలు ఉం టాయి. విద్యార్థులు జవాబులను ప్రశ్నపత్రం లోనే టిక్ చేయాలి. రాయాలి. ఓఎంఆర్‌లో బబుల్ చేయాలి.
- అన్ని పరీక్షలకు కలిపి ఒకే ఓఎంఆర్ షీట్ ఇస్తారు. కాబట్టి ప్రతి రోజు పరీక్ష పూర్తయిన వెంటనే ప్రశ్నపత్రంతో పాటుగా ఓఎంఆర్ షీట్ వెనక్కు తీసుకోవాలి. పరీక్షలు పూర్త యిన వెంటనే ఓఎంఆర్ షీట్స్ అన్నింటిని తరగతుల వారీగా ప్యాక్ చేసి సీఆర్‌పీ ద్వారా ఎంఆర్‌సీలకు పంపించాలి.
- ఎంఈవోలు మండలంలోని అన్ని పాఠశా లల ఓఎంఆర్ షీట్స్ ప్యాకెట్లను సేకరించి, ఎంఈవో అధీకృతం చేసిన వారి ద్వారా డీసీ ఈబీ కాకినాడకు పంపించాల్సి ఉంటుంది.
- కాకినాడలో ఓఎంఆర్ షీట్స్ స్కాన్ చేస్తారు. అయితే విద్యార్థులు పొందిన మార్కుల వివరాలు పాఠశాలలకు తెలియజేయరు. విద్యార్థులు పొందిన మార్కుల ఆధారంగా భవిష్యత్తులో ఉపాధ్యాయులకు, విద్యార్థు లకు ఇవ్వవలసిన శిక్షణ కార్యక్రమాల రూప కల్పనకు మాత్రమే వినియోగిస్తారు.
- ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థుల నుం చి జవాబులతో కూడిన ప్రశ్నపత్రాలను తీసు కుని, జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలి.

విద్యార్థులు పొందిన మార్కులను సం బంధిత రిజిస్టర్లలో నమోదు చేయాల్సి ఉం ది. నిర్ణీత సమయంలోపు సీఎస్ఈ వెబ్ సైట్‌లో నమోదు చేయాలి.

- జవాబులతో కూడిన ప్రశ్నపత్రాలను అధికా రుల పరిశీలనార్థం భద్రపర్చాలి.
- విద్యార్థులు పొందిన మార్కులను ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి విద్యార్థుల తల్లిదండ్రు లకు పంపించాలి.

తక్కువ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఉపాధ్యా యులు, తల్లిదండ్రుల సమీక్షా సమావేశంలో ఎఫ్ఏ–3లో విద్యార్థులు చూపిన ప్రతిభపై చర్చించాల్సి ఉంటుంది.

మార్కుల అప్‌లోడ్ షెడ్యూల్ విడుదల

పరీక్షల మూల్యాంకనం, మార్కుల అప్‌లోడ్ షెడ్యూల్‌ను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి విడుదల చేశారు. 7వ తేదీన 3–10 ఓఎస్ఎస్‌సీ పరీక్షా పత్రాలను ఈ నెల 9న మూల్యాంకనం చేసి, మార్కులను ఈ నెల 14న అప్‌లోడ్ చేయాలి. ఈ నెల 8న 1–10 తరగతులకు నిర్వహించే తెలుగు, గణితం పరీక్ష పేపర్ల మూల్యాంకనం ఈ నెల 10న, ఈ నెల 9న 1–10 తరగతులకు నిర్వహించ నున్న హిందీ, సైన్స్ పేపర్ల మూల్యాంకనం ఈ నెల 11న, ఈ నెల 10న నిర్వహించే ఇంగ్లిష్, సోషల్ పరీక్ష పేపర్ల మూల్యాంకనం ఈ నెల 12న చేపట్టాలని ఆదేశాలిచ్చారు. 1–10 తరగతుల వరకు మార్కులను ఈ నెల 14న రిజిస్టర్లు, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సాయిబాబు (ఫైల్)

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కె.పెదపూడి శివారు పెచ్చెట్టివారిపాలేనికి చెందిన చుట్టుగుళ్ల సాయిబాబు (57) తన మోటారు సైకిల్‌పై అంబాజీపేట వస్తున్నాడు. స్థానిక బస్టాండ్ సమీపంలో రహదారికి అడ్డంగా నిలిపి ఉన్న లారీని సాయిబాబు తప్పించే ప్రయత్నం చేస్తుండగా తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని 108లో అమలాపురం తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు ప్రశాంతకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు.

యువకుడిని రక్షించిన మత్స్యకారులు


యువకుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై జానీబాషా

మామిడికుదురు: పాశర్లపూడి–బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి సోమవారం వైనతేయ గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడిని స్థానిక మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. మలికిపురం మండలం గూడపల్లికి చెందిన యువకుడు నాగళ్ల సత్తిబాబు ఆత్మహత్య చేసుకోవడానికి బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకాడు. గోదావరిలో మునిగిపోతూ రక్షించండి, రక్షించండి అంటూ కేకలు వేస్తున్న యువకుడిని సమీపంలో వేటాడుతున్న మత్స్యకారులు కొల్లు నాగకృష్ణ, రాకేష్ వర్మ, నాని రక్షించారు. బోటులో ఎక్కించుకుని అతనికి సపర్యలు చేశారు. ఆ యువకుడిని నగరం ఎస్సై షేక్ జానీబాషాకు అప్పగించారు. ప్రాణాపాయం నుంచి కాపాడిన మత్స్యకార యువకులను ఎస్సై అభినందించారు. అనారోగ్యం బాధలు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్సై తెలిపారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.


మొదటి మ్యాచ్ విజేత రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు


రెండో మ్యాచ్ గెలిచిన పెద్దాపురం శ్రీప్రకాష్ జట్టు

ఉత్సాహంగా సెమీఫైనల్స్

సాక్షి ప్రీమియర్ లీగ్ టి-20 పోటీలు


మూడో మ్యాచ్ విజేత రాజమహేంద్రవరం గైట్ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రీడాప్రాంగణంలో సోమవారం ప్రారంభమైన సాక్షి ప్రీమియర్ లీగ్ టి–20 సెమీఫైనల్స్ ఉత్సాహంగా జరిగాయి.

- మొదటి మ్యాచ్‌లో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ జట్టు టాస్ గెలుచుకుని ఫీల్డింగ్ ఎంచుకుంది. రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 145 పరుగులు చేసి 2 వికెట్లు కోల్పోయింది. బ్యాట్స్‌మెన్ అజిత్ 86, సాగర్ 51 పరుగులు సాధించారు. 146 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన జీఎస్ఎల్ జట్టు నిర్ణీత ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలిపోయింది. 54 పరుగుల తేడాతో రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది.
- రెండో మ్యాచ్‌లో జీబీఆర్ అనపర్తి, శ్రీ ప్రకాష్ పెద్దాపురం జట్లు పోటీ పడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన జీబీఆర్ నిర్ణీత 10 ఓవర్లలో 62 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీప్రకాష్ జట్టు ఒక వికెట్ నష్టానికి 64 పరుగులు సాధించి 9 వికెట్ల తేడాతో విజయం సొంతం చేసుకుంది. జట్టులోని బ్యాట్స్‌మెన్ దిలీప్ 31, సాకేత్ 15, యశస్వి 14 పరుగులు చేశారు.
- మూడో మ్యాచ్‌లో రాజమహేంద్రవరానికి చెందిన గైట్ ఇంజినీరింగ్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 98 పరుగులు చేసింది. అజిత్ 14, మణికంఠ సాయి 11 పరుగులు చేశారు. 99 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన గైట్ జట్టు నిర్ణీత ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 100 పరుగులు సాధించి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ గణేష్, మణికంఠ చెరో 18 పరుగులు చేశారు. మ్యాచ్‌లను క్రికెట్ కోచ్ చార్లి, టోర్నమెంట్ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్, హరిష్ స్పోర్ట్స్ అధినేత టి.హరిష్ పర్యవేక్షించారు.

SAKSHI MEDIA GROUP
సాక్షి | సాక్షి SAKSHI TV
www.sakshi.com

SPL
SAKSHI PREMIER LEAGUE

గుప్త నిధుల వేటకు వచ్చి పోలీసులకు చిక్కి....

సామర్లకోట: దివంగత సిద్ధాంతి గణపతి శాస్త్రి ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని దొంగిలించడానికి ప్రయత్నం చేసిన నిందితులు పోలీసులకు చిక్కారు. గత నెల 17న దొంగతనానికి వచ్చిన నిందితులు తలుపుల తాళాలు పగుల గొట్టిన సమయంలో అలికిడి కావడంతో పరారు అయిన విషయం విదితమే. ప్రత్యేక నిఘా ఉంచి నేరం చేయడానికి ప్రయత్నం చేసిన ఏడుగురిని అరెస్టు చేసి సోమవారం కోర్టుకు పంపినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. నిందితులలో భీమవరానికి చెందిన సిత్తిని అర్జునరావు, రౌతులపూడికి చెందిన ఎలుగుబంటి సురేష్, రాజపూడికి చెందిన బుసల బాబురావు, కందుల దొరప్రసాద్, విజయనగరానికి చెందిన పిండ్రాల అప్పన్న, అసనాల గోవిందు, పశ్చిమ గోదావరి జిల్లా పత్తూరుకు చెందిన గంటా యుగంధర్ వెంకటరమణ కిషోర్‌లను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

నిర్దిష్ట ప్రణాళికతో ఉన్నత శిఖరాలకు..


విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నిర్దిష్ట ప్రణాళికతో విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ప్రోగ్రాం కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 24 ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న 406 మంది మెరిట్ విద్యార్థినులకు మలబార్ గోల్డ్ అందించిన రూ.37.52 లక్షల స్కాలర్‌షిప్పులను ఆమె సోమవారం పంపిణీ చేశారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. నాడు – నేడు ద్వారా పాఠశాలల ఆధునీకరణతో పాటు మౌలిక సౌకర్యాలను కల్పించిందన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పరిశ్రమలు, ఇన్‌స్టిట్యూట్లు ముందుకు వస్తే పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో మరింత సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రముఖ మానసిక వైద్యుడు, బీసీ రాయ్ అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని, సమయ పాలన పాటిస్తూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులకు కలెక్టర్, అతిథుల చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. మల్‌బార్ గోల్డ్ స్టోర్ హెడ్ కె.ఫెబిన్, షోరూం మేనేజర్ కె.వెంకట లక్ష్మీపతి, మార్కెటింగ్ మేనేజర్ ఎ.ప్రవీణ్‌కుమార్, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు, ఇంటర్ బోర్డ్ ఆర్‌జేడీ శారద పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన బ్యాక్‌లాగ్స్

- అర్థాంతరంగా ముగిసిన భావి ఇంజినీర్ జీవితం
- ఉరి వేసుకొని ఆత్మహత్య


దుర్గారామ్‌గోపాల్ (ఫైల్)

కాకినాడ రూరల్: నాలుగేళ్ల పాటు బీటెక్ కష్టపడి చదివినా నాలుగు సబ్జెక్టులు బ్యాక్‌లాగ్స్‌గా ఉండిపోవడం అతనిలో తీవ్ర మానసిక సంఘర్షణ దారి తీసింది. పెరిగిన మనోవేదన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొనేలా పురిగొల్పింది. ఈ విషాద ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, సర్పవరం పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాకినాడ గుడారిగుంట శాంతనపూరి కాలనీకి చెందిన గెంగిరి దుర్గారామ్‌గోపాల్(23)ది చేపల వేట ద్వారా జీవనోపాధి సాగించే కుటుంబం. అతని తండ్రి గతంలో చనిపోగా తల్లీ, అక్క, తమ్ముడు ఉన్నారు. కోరంగి వద్ద గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో దుర్గారామ్‌గోపాల్ బీటెక్ సివిల్ బ్రాంచ్‌లో చదివాడు. గత ఏడాది ఇంజినీరింగ్ నాలుగేళ్ల కోర్సు పూర్తయింది. నాలుగు సబ్జెక్టులు బ్యాక్‌లాగ్‌గా ఉండిపోయాయి. వారం రోజుల క్రితమే హైదారాబాద్‌లో ప్రైవేట్ జాబ్‌లో చేరాడు. ఈ లోగా బ్యాక్‌లాగ్ పరీక్షలకు నోటిఫికేషన్ రావడంతో ఈ నెల 14వ తేదీ నుంచి జరగనున్న పరీక్షల కోసం సన్నద్ధం అయ్యేందుకు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. దుర్గారామ్‌గోపాల్ వలసపాకల గ్రామంలోని ఓయో అద్దె గదిని ఆదివారం ఉదయం తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫోన్ ఆన్సర్ చేయకపోవడంతో రాత్రి వరకు ఆరా తీసీ ఓయో గదుల బయట అతని మోటార్ సైకిల్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. సోమవారం ఉదయం సర్పవరం పోలీసులు, కుటుంబ సభ్యులు వలసపాకలలోని కృష్ణుడి గుడి సమీపం వద్ద ఓయో రూమ్ తలుపులు తెరిచారు. ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. రెండు రోజులుగా ఇంటి వద్ద ఉన్న రామ్‌గోపాల్ బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉండిపోవడంతో వాటి గురించే ఆలోచించేవాడని అతని అక్క మంజూష తెలిపింది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో ఆమె ఫోన్ చేసింది. సాయంత్రం నాలుగు గంటల వరకు రింగ్ అయ్యి ఆగిపోయిందని, తరువాత శవమై కనిపించాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఘటనా స్థలాన్ని ఏఎస్సై నాగేశ్వరావు, సిబ్బంది పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మంజూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీఐ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- 54 సెల్‌ఫోన్లు, 9 బైక్‌లు స్వాధీనం
- వీటి విలువ రూ.13.52 లక్షలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపుతున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: రైళ్లలో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లతో పాటు బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 54 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లను, 9 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన బోధల సురేష్, కాకినాడ జిల్లా తుని రూరల్ మండలం కొలిమేరు గ్రామానికి చెందిన బొందల అప్పారావు అన్నవరంలో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వీరు సామర్లకోట, అన్నవరం, తుని, పిఠాపురంలో ప్రయాణికుల మాదిరి రైళ్లు ఎక్కుతారు. రాత్రివేళ రైళ్లలో సెల్‌ఫోన్లు చార్జింగ్‌లో పెట్టి నిద్రపోయే వారి నుంచి చాకచక్యంగా చార్జర్‌తో పాటు ఫోన్లను దొంగతనం చేస్తున్నారు. యూట్యూబ్ ద్వారా ఈ ఫోన్ల లాక్‌లను తొలగించి, అపరిచితులకు తక్కువ రేట్లకు విక్రయించి, జల్సాలు చేయడం వీరి నైజం. బస్, రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాల్లో బైక్‌ల చోరీకి పాల్పడుతున్నారు. వీరిద్దరినీ అన్నవరంలో ఆది, సోమవారాల్లో అదుపులోకి తీసుకున్నారు. బోధల సురేష్ నుంచి ఎనిమిది మోటారు సైకిళ్లు, 48 సెల్‌ఫోన్లను, బొందల అప్పారావు నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 13.52 లక్షలు ఉంటుందని సీఐ కిషోర్‌బాబు తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్సైలు కె.సుధాకర్, జి.సతీష్, ఏఎస్సై శ్రీనివాస్, హెచ్‌సీ గోవిందు, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

శంఖవరం: విద్యార్థి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే..శంఖవరం మండలం కత్తిపూడి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థి మసరపు చరణ్‌తేజ అదే గ్రామ జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన ఈ విద్యార్థి ఈ నెల 3న స్కూలు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాలు, విద్యార్థి ఇంటి దగ్గర వెతికినా ఆచూకీ దొరకలేదు. విద్యార్థి స్కైబ్లూ షర్ట్, నేవీ బ్లూ ప్యాంటు గల స్కూలు యూనిఫాం ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసినవారు అన్నవరం పోలీసుస్టేషన్ 9440796571, ప్రత్తిపాడు సీఐ 9440796530 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

రేషన్ బియ్యం, పంచదార సీజ్


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, పంచదార బస్తాలు

తుని రూరల్: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం, పంచదారను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు సీజ్ చేశారు. సోమవారం అందిన సమాచారం మేరకు తుని మండలం రేఖవానిపాలెం శివారు ఖాళీ స్థలంలో తరలించేందుకు లారీలో ఉంచిన 16 బస్తాల్లోని 800 కిలోల బియ్యం, అరకేజీ చొప్పున ఉన్న 300 పంచదార ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ పి.వి.రవికుమార్ ఆదేశాలతో ఆకస్మిక దాడి చేసినట్టు తుని మండలం పౌరసరఫరాల అధికారి కె.పుణ్యవతి తెలిపారు. 6ఏ కేసు నమోదు చేసి బియ్యం, పంచదారను అదే గ్రామంలో ఉన్న ఎఫ్‌సీఐ గొడౌన్‌కు అప్పగించామని చెప్పారు. సరకును తరలిస్తున్న బొట్టా గోవిందరావుకు చెందిన లారీని సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించినట్టు ఎంఎస్‌ఓ వివరించారు.

హెడ్ మాస్టర్‌ను హత్య చేసినందుకు జీవిత ఖైదు

కాకినాడ లీగల్: జల్సాలకు అలవాటుపడి పథకం ప్రకారం హెడ్ మాస్టర్‌ను హత్య చేసి, దొంగతనం చేసిన కేసులో వ్యక్తికి జీవిత ఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం వెలమల తూరంగి గ్రామంలో పట్నాల వెంకటరావు నివసించేవారు. ఆయన రేపూరు గ్రామంలో ఎంపీపీ యూపీ స్కూల్‌లో హెడ్ మాస్టర్‌గా విధులు నిర్వహించేవారు. 2019 సెప్టెంబర్ 14 తేదీన ఆయన కుటుంబ సభ్యులు ఊర్లో లేకపోవడంతో గమనించి పథకం ప్రకారం రేపూరు గ్రామానికి చెందిన ఇసుకపాటి ఏసురాజు..మరో ముగ్గురు మైనర్లతో కలిసి ఇంటి వెనుక డోరు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగా హెడ్ మాస్టర్‌పై ఏసురాజుతోపాటు ముగ్గురు మైనర్లు కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఇంట్లో ఉన్న రెండు సెల్‌ఫోన్లు, నగదును దొంగిలించారు. మృతుని కుమార్తె ఖండవల్లి సత్య సూర్యారామ దీపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఇంద్రపాలెం ఎస్సై మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో ఏసురాజుపై నేరం రుజువుకావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా, దొంగతనం చేసినందుకు మూడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండు శిక్షలూ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ఈ హత్య కేసులో ఇసుకపాటి ఏసురాజుకు శిక్ష విధించారు. ముగ్గురు మైనర్లపై రాజమహేంద్రవరం జువైనల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది.

వివాహిత మృతిపై కేసు

రాయవరం: మండలంలోని చెల్లూరుకు చెందిన వివాహిత ఉరివేసుకుని మృతి చెందిన ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై పీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన దుర్గాలక్ష్మి(23)ని ఎనిమిదేళ్ల క్రితం చెల్లూరుకు చెందిన సుబ్బారావుకు ఇచ్చి వివాహం చేశారు. సంతానం కలగని కారణంగా దుర్గాలక్ష్మి మానసిక వ్యధకు గురయింది. ఇదే విషయాన్ని ఆమె తల్లి పెదపూడి పార్వతికి చెప్పి బాధపడింది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో దుర్గాలక్ష్మి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. ఈ మేరకు పెదపూడి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో ఉన్న పలు రసాయనిక ఎరువుల దుకాణాలను కరప వ్యవసాయ శాఖ ఏడీఏ కె. బాబూరావు ఆధ్వర్యంలో అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఫారం ఓ లేని రూ.81,600 విలువైన 68 బస్తాల డీఏపీ అమ్మకాలను నిలుపుదల చేశారు. కరప వ్యవసాయ శాఖ ఏడీఏ కె.బాబూరావు మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని గొల్లప్రోలు సొసైటీకి 20 టన్నులు, ఎరువుల షాపులకు 120 టన్నులు, కొన్ని రైతు భరోసా కేంద్రాలకు 52 టన్నుల సరకు వచ్చిందన్నారు. మిగిలిన రైతు భరోసా కేంద్రాలకు యూరియా సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. పిఠాపురం హబ్ మేనేజర్ డి. సంజీవ్ కుమార్, మండల వ్యవసాయ శాఖాధికారి కెవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


చిట్టెమ్మ (ఫైల్)

రాయవరం: మండలంలోని చెల్లూరుకు చెందిన శతాధిక వృద్ధురాలు గాజుల చిట్టెమ్మ(104) సోమవారం మృతి చెందింది. ఈ విషయాన్ని చిట్టెమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. చిట్టెమ్మకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుల్లో ఇద్దరు కొన్నేళ్ల క్రితం మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది.

వివాహిత అదృశ్యం


వీరవెంకట గంగాభవాని (ఫైల్)

రాయవరం: చెల్లూరు గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డి వీరరాఘవులు భార్య వీరవెంకటగంగాభవానితో కలిసి ఉద్యోగం నిమిత్తం తణుకులో నివాసం ఉంటున్నాడు. ఈ నెల ఒకటో తేదీన గంగాభవాని దివ్యాంగ పింఛను తీసుకునే నిమిత్తం చెల్లూరు గ్రామానికి వచ్చింది. వలంటీర్ వద్ద పింఛను తీసుకొని తిరిగి తణుకు బయలుదేరింది. ఆమె ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండాపోవడంతో రాయవరం పోలీసులను ఆశ్రయించారు. వీరరాఘవులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.